క్లుప్తంగా

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

పొదలకూరు : పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులను ఆహ్వానిస్తూ ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఫ్రెషర్స్ డేను శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్, ఎస్సై డి.రామకృష్ణ, టీటీడీ విజిలెన్స్ రిటైర్డ్ డీఎస్పీ ప్రభాకర్‌గౌడ్ హాజరయ్యారు.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో వెంకయ్యస్వామి

మనుబోలు : మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు జరిగాయి. అర్చకుడు శ్రీనివాసులు మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. వివాహం, సంతానం కోసం పలువురు హోమ గుండం వేశారు. కిశోర్, శ్రావ్య దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..



పొదలకూరు : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి అమ్మవార్ల శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు.

సోమిరెడ్డి బతుకే అవినీతిమయం

- మాజీ ఎంపీపీ మహేంద్ర

పొదలకూరు : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బతుకంతా అవినీతిమయమేనని పొదలకూరు మాజీ ఎంపీపీ బిరదవోలు మహేంద్ర ఫైర్ అయ్యారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఏపీలో అవినీతికి సోమిరెడ్డి కేరాఫ్ అడ్రస్‌గా మారినట్టు దుయ్యబట్టారు. మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేరు పలికే అర్హత సోమిరెడ్డికి లేదన్నారు. పోరాటాల పేరిట వేల కోట్ల అవినీతికి పాల్పడినట్టు ఆరోపించారు. ఫ్లై యాష్, ఇసుక అక్రమ రవాణా, భూములను కొల్లగొట్టడం వంటి అక్రమాలకు పాల్పడినట్టు తెలిపారు. పొదలకూరులో వేసిన లేఅవుట్ల నుంచి బేరసారాలు సాగిస్తున్నట్టు తెలియజేశారు. మా నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరినట్టు రాజరాజేశ్వరి అమ్మవారి వద్ద నిజాయతీ పరుడిననే ప్రమాణం చేయగలవా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్ష సాధించడం, క్యాష్ మూటకట్టుకోవడం తప్ప నువ్వు సాధించిన అభివృద్ధి ఏమైనా ఉందా అని నిలదీశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన రాజేంద్ర


బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని టోల్‌ప్లాజా సమీపంలో ముంబై జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డుపై నిలిపి ఉన్న లారీని సంగం మండలం సిద్ధీపురానికి చెందిన రాజేంద్ర బైక్‌పై సంగం వైపు వెళ్తూ వెనుకవైపు నుంచి లారీని ఢీకొట్టాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చిన్నారులను ఆదరిద్దాం

నెల్లూరు(అర్బన్): పేద విద్యార్థులు, ఇబ్బందుల్లో ఉన్న చిన్నారులను ఆదరించాలని పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ అన్నారు. స్థానిక పొదలకూరు రోడ్డులోని వియాని హోంలో శనివారం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దంత వైద్యనిపుణుడు డాక్టర్ అనుమల ఆదర్శ్ పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు అన్నదానం చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి, చిన్నారులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పీహెచ్‌పీ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య పాల్గొన్నారు.

మగువలకు ప్రత్యేకం 'వన్‌గ్రామ్ గోల్డ్'


- సామాన్యులకు దూరంగా బంగారం ధరలు
- బంగారు తాపడం నగలపై పెరుగుతున్న ఆసక్తి
- రోల్డ్‌గోల్డ్ స్థానంలో వన్‌గ్రామ్ గోల్డ్



బంగారు నగలను తలపిస్తున్న వన్ గ్రామ్ గోల్డ్ హారాలు, చెవి పోగులు



బంగారు చైన్‌లను పోలి ఉన్న వన్ గ్రామ్ గోల్డ్ చైన్‌లు



వన్‌గ్రామ్ గోల్డ్ వడ్డానం

కొడవలూరు : కొన్నేళ్లుగా బంగారం ధర రోజు రోజుకు పెరుగుతోంది. దీంతో ఆభరణాల కొనుగోలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలో మేలిమి బంగారం కంటే మిన్నగా కనిపించే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిపై మగువలు బాగా ఆసక్తి కనబరుస్తున్నారు. పండగలు, శుభకార్యాలకు వీటిని ధరిస్తున్నారు. ప్రస్తుతం నెల్లూరు నగరంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణాలు ఇబ్బడి ముబ్బడిగా వెలసి వినియోగదారులను ఆకట్టుకొంటున్నాయి.

తేడా గుర్తించడం కష్టమే..

మార్కెట్‌లోకి వన్‌గ్రామ్ గోల్డ్ నగలు రాకముందు గిల్టు(రోల్డ్ గోల్డ్) నగలు అందుబాటులో ఉండేవి. బంగారు నగలకు వీటికి చాలా తేడా ఉండేది. ఈ గిల్టు నగలను ఫ్యాషన్‌గా పెట్టుకోవడానికే తప్ప పెళ్లిల్లు వంటి వేడుకలప్పుడు పెట్టుకునేందుకు పెద్దగా ఆసక్తి కనబరిచే వారు కాదు. కానీ ఇప్పుడు ఇత్తడేదో పుత్తడేదో తెలియనంతగా అందమైన రాళ్ల నగిషీలతో మెరిసిపోతూ వన్‌గ్రామ్ నగలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వయస్సు తేడా లేకుండా చిన్నా పెద్దా అందరూ వీటిని ఇష్టంగా ధరిస్తున్నారు. చెవి పోగుల నుంచి కాలపట్టీల వరకు హారాల నుంచి వడ్డాణాల దాకా అచ్చం బంగారం అనిపించేలా ఇవి ఆకట్టుకొంటుండడం గమనార్హం.

రోల్డ్‌గోల్డ్‌కు, వన్‌గ్రామ్‌కు తేడా ఏంటంటే..

రోల్డ్‌గోల్డ్‌కు వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలకు పెద్దగా తేడా ఉండదు. రోల్డ్‌గోల్డ్ నగలను రాగి, ఇనుము, అల్యూమినియం తదితర వాటితో తయారు చేస్తారు. వీటికి 8 లేక 10 క్యారెట్ల బంగారు పూత వేస్తారు. పది క్యారెట్ల బంగారంలో 41.7 శాతం మాత్రమే బంగారం ఉంటుంది. ఇవి నీళ్లు తడుస్తుంటే త్వరగా నల్లబడిపోతాయి. వన్ గ్రామ్ గోల్డ్ నగలను రాగి లేక వెండితో మాత్రమే తయారు చేస్తారు. వీటిని 22 లేదా 24 క్యారెట్ల బంగారంతో తాపడం చేయడం వల్ల బంగారు ఆభరణాల కంటే ఎక్కువ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఎక్కువ కాలం రంగు పోకుండా ఉంటాయి.

తయారీ ఎక్కడంటే..

వన్‌గ్రామ్ గోల్డ్ నగలు ఎక్కువగా ముంబై, బెంగళూరు, మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ప్రాంతాల్లో తయారు చేస్తారు. నెక్లెస్‌లు, వడ్డాణాలు, గాజులు, గొలుసులు, ఉంగరాలు, లాకెట్‌లు, వంకీలు, కాల పట్టీలు, చెవి రింగులు వంటి పలురకాల ఆభరణాలతో పాటు ఆర్డర్లపై ప్రత్యేకంగా కోరిన మోడల్‌నూ తయారు చేసి ఇస్తున్నారు.

ఉపాధి కల్పిస్తున్న వన్‌గ్రామ్ వ్యాపారం

బంగారం తర్వాత అంతటి పేరున్న వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారులకు ఉపాధి చూపుతోంది. జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాల్లో ప్రత్యేకంగా దుకాణాలను ఏర్పాటు చేసి అమ్మకాలు చేస్తున్నారు. ఒక్క నెల్లూరు నగరంలోనే వందకుపైగా దుకాణాలున్నాయంటే వీటికున్న క్రేజ్ ఏమిటో అవగతం చేసుకోవచ్చు. ఈ ఆభరణాలు సైజ్‌ను బట్టి రూ.వంద నుంచి రూ.6 వేలు వరకు అందుబాటులో ఉన్నాయి. చెవి పోగుల్లాంటి చిన్నవైతే బాగా తక్కువ ధరల్లో, వడ్డాణాల్లాంటి పెద్దవైతే ఎక్కువ ధరల్లో లభ్యమవుతున్నాయి.

చోరీ జరిగినా నష్టం లేదన్న ధీమా

ఇటీవల కాలంలో చైన్ స్నాచింగ్‌లు, తాళం వేసిన ఇంట్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలు జరిగినా ఆర్థికంగా నష్టం ఉండదనే ఉద్దేశంతో చాలా మంది ధనిక వర్గాల మహిళలు సైతం వీటిని కొనుగోలు చేస్తున్నారు. వీరు మేలిమి బంగారు నగలను బ్యాంక్ లాకర్‌లో భద్రపరచి వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను ఇంట్లో తెచ్చి పెట్టుకొంటున్నారు. ప్రత్యేకమైన సందర్భాల్లో తప్ప మరెప్పుడూ బంగారు ఆభరణాల జోలికెళ్లడం లేదు. మిగిలిన సమయాల్లో వన్‌గ్రామ్ గోల్డ్‌తోనే కాలం నెట్టుకొస్తున్నారు. వీటికి గ్యారెంటీ కూడా ఇస్తుండడంతో వినియోగదారుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

దొంగల భయం ఉండదు



ప్రస్తుత పరిస్థితుల్లో బంగారు నగలు ధరించి ఎక్కడికైనా వెళ్లాలంటే భయమేస్తోంది. చైన్ స్నాచర్లు ఆడవాళ్లనే లక్ష్యంగా చేసుకుని మెడలోని దండలను లాక్కెళ్తున్నారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే మా లాంటి మధ్య తరగతి వాళ్లం ఆర్థికంగా బాగా ఇబ్బంది పడుతాం. వన్‌గ్రామ్ గోల్డ్ నగలు కూడా అసలు నగలనే పోలి ఉంటున్నందున వాటినైతే ఎక్కడికైనా ధైర్యంగా వేసుకుని వెళ్లవచ్చు. చోరీ జరిగినా ఆర్థికంగా పెద్దగా నష్టం ఉండదు. అందువల్ల వన్‌గ్రామ్ నగలనే ఎక్కువగా వినియోగిస్తున్నాం. పైగా నార్తురాజుపాళెంలోనే ఇవి లభ్యమవుతున్నందున నెల్లూరు నగరానికి వెళ్లాల్సిన అవసరం లేదు.

– పానేటి సంధ్యారాణి, నార్తురాజుపాళెం

మాలాంటి వారికి ఊరట



బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్న ప్రస్తుత తరుణంలో మధ్య తరగతి వారు బంగారు ఆభరణాలు ధరించడం కష్టమే. అందువల్లే తక్కువ ధరలోనే అసలు నగలను పోలి ఉండే వన్‌గ్రామ్ గోల్డ్ నగలను వినియోగిస్తున్నాం. తద్వారా నగలు ధరించామన్న అనుభూతి ఉండడంతో పాటు ఆర్థిక భారం తప్పుతుంది. బంగారు నగలు కొనాలంటే అప్పు చేయాల్సిన పరిస్థితి ఉన్నందున వన్‌గ్రామ్ నగలు ఎంతో ఉపకరిస్తున్నాయి. రోల్డ్‌గోల్డ్ నగలనైతే అసలు నగలు కాదని సులువుగా గుర్తిస్తారు. వన్‌గ్రామ్ నగలను ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తించలేరు.

– ఎస్కే మాఫ్ జాన్, కొడవలూరు

జట్లకొండూరు మాజీ సర్పంచ్ మృతి



పట్టాభిరామిరెడ్డి (ఫైల్)

మనుబోలు : మండలంలోని జట్లకొండూరు గ్రామ మాజీ సర్పంచ్ పల్లంరెడ్డి పట్టాభిరామిరెడ్డి(85) అలియాస్ బుజ్జిరెడ్డి అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. అజాత శత్రువుగా పేరు తెచ్చుకున్న పట్టాభిరామిరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన నాయకులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

మెనూ అమలు తప్పనిసరి



బీసీ హాస్టల్లో వంట గదిని పరిశీలిస్తున్న మురళీకృష్ణ యాదవ్

వెంకటాచలం : ప్రభుత్వం ఇచ్చిన మెనూను తప్పనిసరిగా అమలు చేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మురళీకృష్ణ యాదవ్ అన్నారు. మండలంలోని గొలగమూడి, ఎర్రగుంట గ్రామాల వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాల, బాలికల వసతి గృహాలను శనివారం ఆయన సందర్శించారు. వంట గదులు, మధ్యాహ్నం భోజనం ఎలా ఉందో పరిశీలించారు. భోజనం, విద్యాబోధన ఎలా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటుగా, క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని ఉపాధ్యాయులను కోరారు.

వాటర్ ప్లాంట్లలో శ్యాంపిల్స్ సేకరణ



నెల్లూరు రోడ్డులో ఉన్న వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పొదలకూరు : పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లలో నీళ్ల శ్యాంపిల్స్‌ను అధికారులు శనివారం సేకరించారు. వర్షాకాలంలో నీటి ద్వారా వ్యాపించే సీజనల్ వ్యాధులైన వాంతులు, విరేచనాల బారిన ప్రజలు పడకుండా ముందు జాగ్రత్తలో భాగంగా ఆరోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు కలిసి వాటర్ ప్లాంట్లలో పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పరిధిలో మొత్తం ఎనిమిది వాటర్ ప్లాంట్లలో నీటి శ్యాంపిల్స్‌ను సేకరించామని, 48 గంటల వరకు పర్యవేక్షణలో ఉంచి పరీక్షిస్తామన్నారు. వాటర్ ప్లాంట్ల నిర్వాహకులకు పలు సూచనలు చేసినట్టు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఫ్లూ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, దగ్గు, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రతించాల్సిందిగా తెలియజేశారు. కార్యక్రమంలో విస్తరణాధికారి రవికుమార్, సచివాలయాల కార్యదర్శులు షఫీ, వంశీ, నాగేశ్వరరావు, ఆరోగ్య సహాయకులు రాధాకుమారి, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కిట్ల పంపిణీ



విద్యార్థికి కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మినగల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శనివారం విద్యార్థులకు కిట్లను అందజేశారు. అనంతరం ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సౌకర్యాలను ఉపయోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రామారావు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చిరు వర్షానికే చెరువులా..



చెరువును తలపిస్తున్న మినగల్లు రహదారి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని మినగల్లు గ్రామ రహదారి అధ్వానంగా మారింది. స్వల్ప వర్షానికే గుంతలమయంగా మారి చెరువును తలపిస్తోంది. దీంతో గ్రామస్తులు, వాహనదారులు ఈ రహదారి గుండా బుచ్చి పట్టణానికి వెళ్లాలంటే హడలిపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని వేడుకుంటున్నారు.

కౌలు రైతులను ఆదుకునేందుకు చర్యలు



కౌలు రైతు కార్డులు అందజేస్తున్న ఏడీఏ శ్రీనివాసులు

వెంకటాచలం : కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోందని వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్.శ్రీనివాసులు అన్నారు. మండలంలోని తిక్కవరప్పాడు, కంటేపల్లి గ్రామాల్లో కౌలు రైతులతో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుకు పొలాన్ని సాగు చేసే రైతులు తప్పనిసరిగా సీసీఆర్ కార్డులు తీసుకోవాలని సూచించారు. ఈ కార్డుల వల్ల రైతులకు అనేక ప్రయోజనాలున్నాయని చెప్పారు. సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ హరి కరుణాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కందిమళ్ల వెంకటేశ్వర్లు నాయుడు, శ్రీహరి, అట్ల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులతో కుమ్మక్కై ఆరోపణలు

- ముత్తుకూరు సర్పంచ్‌పై వైఎస్సార్‌సీపీ నేతల ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీపీ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు

ముత్తుకూరు : ముత్తుకూరు సర్పంచ్ బూదూరు లక్ష్మి భూ ఆక్రమణదారులతో కుమ్మక్కై పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడి, ఇప్పుడు తమ పార్టీ నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఎంపీపీ గండవరం సుగుణ, ఉపసర్పంచ్ కాకుటూరు అనితారెడ్డి, వార్డు సభ్యురాలు కావలి సుజాత, వైఎస్సార్‌సీపీ నేత కె.లక్ష్మణరెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రమైన ముత్తుకూరులో శనివారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. సర్పంచ్‌గా గెలిపించిన వైఎస్సార్‌సీపీకి ఇటీవల రాజీనామా చేసిన లక్ష్మి ఆ పార్టీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటు అన్నారు. తన సంతకాలను ఫోర్జరీ చేశారని సర్పంచ్ ఆరోపించిందని, వాస్తవానికి ఆమె స్వయంగా తీర్మానాలు రాసి, వేలి ముద్రలు కూడా వేశారన్నారు. దళితుడైన గత పంచాయతీ కార్యదర్శిని డబ్బు కోసం బెదిరించిందని విమర్శించారు. మూడేళ్లు వైఎస్సార్‌సీపీలో ఉండి టీడీపీ అధికారంలోకి రాగానే ఆ పార్టీ పంచన చేరిందన్నారు. ఆమె సాగించిన అవినీతి పాలనపై విచారణ జరిపించాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు విజ్ఞప్తి చేశారు.

గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టాలి

- ఎస్సై రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రామకృష్ణ

పొదలకూరు : ప్రమాదకరమైన గంజాయిని అరికట్టడంలో విద్యార్థులు ముందుండాలని ఎస్సై డి.రామకృష్ణ తెలియజేశారు. స్థానిక కల్యాణ మండపంలో విజ్ఞాన్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల నిర్మూలనపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎస్సై శనివారం పాల్గొన్నారు. యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు సుబ్బారెడ్డి, ఎన్వీ రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ సుబ్బారావు, టీటీడీ విజిలెన్స్ డీఎస్పీ ప్రభాకర్‌గౌడ్, వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారా?



కొడవలూరులో పారిశుద్ధ్యంపై గ్రామస్తులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

- గ్రామస్తులను ఆరా తీసిన కలెక్టర్

కొడవలూరు : గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారా.. అని కలెక్టర్ ఒ.ఆనంద్ గ్రామస్తులను ఆరా తీశారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి శనివారం ఆయన కొడవలూరులో పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య చర్యలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడి డయేరియా, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ, పంచాయతీ సిబ్బంది రోజువారీ చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మురుగు నీటి కాలువల్లో ఉన్న చెత్తా చెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి రాధాకృష్ణను ఆదేశించారు. వైద్యశాఖ అధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టి గ్రామస్తులకు దోమలబెడద లేకుండా చూడాలని సూచించారు. ఏ ఒక్కరూ సీజనల్ వ్యాధులకు గురికాకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, తాగునీటిలో బ్లీచింగ్ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్ఓ పెంచలయ్య, జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ, అదనపు డీఎంహెచ్ఓ బ్రిజిత, తహసీల్దార్‌లు భానుప్రకాష్, శైలేంద్రకుమార్, వైద్యాధికారులు హరికృష్ణ, రామకృష్ణ, బాలచంద్ర బాబు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో యువకుడు గాయపడిన ఘటన మండలంలోని కనుపూరు సమీపంలో శనివారం జరిగింది. నెల్లూరు నగరం వెంకటేశ్వరపురం ప్రాంతానికి చెందిన చిన్నికృష్ణ పనినిమిత్తం కసుమూరుకు బైక్‌పై వెళ్తుండగా, కనుపూరు సమీపంలో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో చిన్నికృష్ణకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

చేప దొరక్క.. వేట సాగక



వేట లేకపోవడంతో కోడూరు తీరంలో ఉన్న పడవలు

- ఆకలితో అలమటిస్తున్న మత్స్యకారులు

తోటపల్లిగూడూరు : మండలంలోని తీర ప్రాంతాల్లో ఉన్న మత్స్యకారులు ఆకలితో అలమటిస్తున్నారు. కోడూరు పంచాయతీలోని ఎనిమిది మత్స్యకార గ్రామాలతో పాటు వెంకన్నపాళెం పట్టపుపాళెంలో సుమారు 3,500 మంది చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. కాగా గత కొద్ది కాలంగా వాతావరణ ప్రతికూల పరిస్థితుల ప్రభావంతో సముద్రంలోని మత్స్య సంపద ధరికి చేరడం లేదు. దీంతో అంతంత మాత్రంగా సాగుతున్న వేట పూర్తిగా లేకుండాపోయింది. మారిన వాతావరణ పరిస్థితులకు తగ్గట్లు తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. తాజాగా అల్పపీడన ప్రభావంతో సముద్రం ఉగ్రరూపం దాల్చుతోంది. దీంతో వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు భయపడుతున్నారు. ధైర్యం చేసి వేటకు వెళ్లినా మత్స్య సంపద దొరక్క ఒట్టి పడవులతో తిరిగి రావాల్సి వస్తోంది. వేటకు వెళ్లినా మత్స్య సంపద దొరక్కపోగా ఏర్పాటు చేసుకున్న కూలీలతో తీవ్రంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో చేసేదేమి లేక మత్స్యకారులు తమ వేట సామగ్రి అయిన పడవులు, వలలను తీరంలో కట్టేసి ఇతర పనులను చూసుకుంటున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేలాది మంది మత్స్యకారులు కోరుతున్నారు.